# మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

21-12-2024 శనివారం పేజీలు 4 www.manabalagam.com





## బీర్పూర్ దోపిడీ కేసులో ఆరుగురు నిందితులు అరెస్టు

- 10 తులల బంగారం, పదివేల నగదు రికవరీ
- రెండు బొమ్మ తుపాకీలు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

**బీర్పూర్, డిసెంబర్ 20 (మన బలగం):** జగిత్యాల జిల్లాలోని మండల కేంద్రమైన బీర్పూర్ లో ఈనెల 13న తెల్లవారు జామున కాసం ఈశ్వరయ్య ఇంట్లో చొరబడి కొట్టి బొమ్మ తుపాకీతో చంపుతామని బెదిరించి, చేతులు కాళ్లు కట్టేసి బంగారం, నగదు దోచుకున్న నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్నీసుల శ్రీనివాస్, చిప్పబత్తుల తులసయ్య, బక్కెనపల్లి అరుణ్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణిక్యం మరియు ముకునూరి కిరణ్ కుమార్ ఒక గ్యాంగ్ గా ఏర్పడి కొన్ని రోజుల నుంచి కిరణ్ దగ్గర ఉన్న ఒక యంత్రంతో గుప్త నిధుల కోసం వెతుకుతున్నారు. బీర్పూర్ లో డబ్బులు, బంగారం ఉన్న వ్యాపారి కాసం మిగతా 2 లో




## వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం

- ధరణిపై సీబీఐ విచారణకు బీజేపీ డిమాండ్
- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం

**హైదరాబాద్, డిసెంబర్ 20 :** తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు - 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద బాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు. భూభారతిపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బిఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ మిగతా 2 లో

## తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం

- ఈ కార్ రేసింగ్ పై చర్చకు బీఆర్ ఎస్ పట్టు
- భూభారతిపై చర్చను అడ్డుకునే యత్నం
- స్పీకర్ పై పేపర్లు చించి విసిరిన సభ్యులు
- నిరసన తెలుపుతూ సభ నుంచి వాకౌట్



**హైదరాబాద్, డిసెంబర్ 20:** తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడిరది. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో మిగతా 2 లో

## ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

- రూ.600 కోట్లు లూటీకే ఫార్ములా ఈ-రేస్
- విచారణలో ఉన్నందున వివరాలు వెల్లడించలేను
- సభలో సీఎం రేవంత్ రెడ్డి వివరణ

**హైదరాబాద్, డిసెంబర్20:** ఈ–ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ–ఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో 9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో మిగతా 2 లో

శనివారం,
21-12-2024

MANA BALAGAM

మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

## ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ-కార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిరదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏసీబీ విచారణలో ఉన్నందున ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి సీఎం తన మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు చెప్పుకుందాం అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరపాలని.. అధికారులకు సూచించానన్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు సభ జరిగింది.. కానీ దీని గురించి చర్చకి అడగలేదని అన్నారు. ట్విట్టర్ పిట్ట ఇన్నాళ్లు ఎక్కడ పోయాడు.. బీఆర్ఎస్ వాళ్లకు మెదడు కూడా పోయినట్టు ఉందని సీఎం దుయ్యబట్టారు. ఎక్కడికైనా వస్తా.. చర్చ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరం అనుకుంటే వాళ్ల పార్టీ ఆఫీస్ కి ఐనా వెళ్తానని తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బులు లండన్ కంపెనీకి ఎలా వెళ్ళాయని సీఎం అడిగారు. ఈ- కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు అని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. 600 కోట్లు లూటీ చేయాలని ఫార్ములా ఈ-రేస్ తెచ్చారని సీఎం పేర్కొన్నారు. నగదు బదిలీ చేయాలంటే ఆర్బీఐ అనుమతి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్లు రద్దు చేయండని అంటున్నారు.. విచారణ జరగకుండా రద్దు చేస్తారా..? అని సీఎం ప్రశ్నించారు. విచారణ అడిగింది వాళ్ళే.. డిమాండ్ చేసింది వాళ్ళేనని సీఎం తెలిపారు. చర్చకు నేను వెనక్కి పోయే వాడినా అధ్యక్షా.. దేని మీద నైనా చర్చకు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు. హరీశ్ రావు అడిగితేనే ఓఆర్ఆర్ పై సిట్ వేశామన్నారు. ఈ విషయంపై కేసీఆర్ ఇంట్లో గొడవ జరిగిందని తెలిపారు. ఇంటికి వెళ్లాక హరీష్ కు కొరడా దెబ్బలు ఉంటాయన్నారు. హరీష్ బాధను తాను అర్థం చేసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## కేటీఆర్‌పై అక్రమ కేసును ఉపసంహరించుకోవాలి

### బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లాల దశరథ్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 20 (మన బలగం): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును ఉప సంహరించుకోవాలని ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లాల దశరథ్ రెడ్డి డిమాండ్ చేసారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన ఈ ఫార్ములా అక్రమ కేసును ఖండించారు. కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేమురి సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మాజీ కో ఆప్షన్ ఎల్లేటి చిన్నారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు నేమురి నరేశ్, నాయకులు జాజల జగన్ రావు, బొమ్మెన గణేశ్, అసతి పెద్ద రాజం, రహీం, గజ్జ రాజేశ్, పడాల రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పడిపూజ

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 20 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఆడంబరంగా జరిగింది. గ్రామానికి చెందిన మేడి రంజింత్ గౌడ్ స్వామి ఇంట్లో సౌడల వినోద్ గురుస్వామి ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యం కలిశ, గంట, అయ్యప్ప స్వామి అభిషేకాలు, అయ్యప్ప స్వామి అష్టోత్తర, స్వామి వారి 18 మెట్ల పూజ కార్యక్రమం, అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు, అయ్యప్ప స్వామి దీక్ష పరులు భజన సంకీర్తనలు అలరించాయి. పూజా కార్యక్రమం అనంతరం స్వామివారికి ఎంతో ఇష్టమైన వేటతుల్లి ఆట ఆడారు. పూజా కార్యక్రమం అనంతరం గురు సన్మానం జరిగింది. కార్యక్రమంలో గురుస్వాములు గౌడవేనీ సమ్మరావు, వాల్లోట్ నరేశ్, గుడ ముత్యం రెడ్డి, దాసరి మెహన్, ఎలేటి రమేశ్ రెడ్డి, ఎలేటీ ఆనంద్, అవుల శ్రీకాంత్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించలేదని బీజేపీ నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్ ,కేసీఆర్ ,ఫార్ములా-ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయట పెట్టారు. బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ ఎఫ్ ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్ రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జీన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ-ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడిరచారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది. మన దగ్గర ఉన్న సర్వర్లూ క్రాష్ అవుతాయి. అందుకే విచారణకు ఇవ్వడంపై ఇంతకాలం ఆలోచన చేశాం. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా సహకరించలేదన్నారు.

# బీర్పూర్ దోపిడీ కేసులో ఆరుగురు నిందితులు అరెస్టు

మొదటి పేజీ తరువాయి

ఈశ్వరయ్య ఇంట్లో ఆయన, అతని భార్య మాత్రమే ఉంటారు. వారు ముసలి వాళ్ళని, వాళ్ళ ఇంట్లో చొరబడి దోపిడీ చేస్తే మనకు డబ్బు, బంగారు ఆభరణాలు దొరుకుతాయని పథకం రచించారు. ఈనెల 13న రాత్రి అందరూ మంకీ క్యాప్ లు ధరించి బొమ్మ తుపాకీలు పట్టుకొని కిరణ్ కుమార్, అరుణ్, తులసయ్య, మున్నేసుల శ్రీనివాస్ ఒక నెంబర్ లేని వైట్ కలర్ ఏస్సెస్ 125 స్కూటీ, బ్లాక్ కలర్ ఫ్యాషన్ ప్రో బైక్ ల మీద బీర్పూర్ కు వెళ్లారు. అర్ధరాత్రి 2.30 గంటలకు కాసం ఈశ్వరయ్య ఇంటి వెనకాల నుంచి గోడ దూకి బాత్రూమ్ లో దాక్కున్నారు. ఉదయం 5 గంటలకు ఈశ్వరయ్య బాత్రూమ్ కు వెళ్లడానికి రాగా అతనిని గట్టిగా అదిమి పట్టి బొమ్మ తుపాకీతో తల మీద కొట్టి చంపుతామని బెదిరించారు. ఇంట్లోకి ఈడ్చుకెళ్లి ఈశ్వరయ్య, అతని భార్యను కొట్టి గుడ్డ పేగులు నోట్లో కుక్కి వారిని కట్టేశారు. వారి ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉన్న డబ్బులు దోపిడీ చేసి పారిపోయారు. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు విచారణలో కొందరు నిందితులు ధర్మపురి మండలంలోని తుమ్మెనల గుట్ట దగ్గర ఉన్నారని సమాచారం మేరకు శుక్రవారం సహదేవ్ హోటల్ దగ్గర ఆరుగురు నింధితులను అదుపులోకి తీసుకున్నారు. దస్తురాబాద్ మండలం మున్యాల్ కు చెందిన మున్నేసుల శ్రీనివాస్, లక్షెట్టిపేట మండలం గోపవాడకు చెందిన చిప్పబత్తుల తులసయ్య, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్పల్లికి చెందిన బక్కెనపల్లి అరుణ్, బీర్పూర్ మండల కేంద్రానికి చెందిన యశోధా శ్రీనివాస్, ధర్మపురి మండలం తుమ్మెనలకు చెందిన సైదు సహదేవ్, జన్నారం మండలం మరిమడుగుకు చెందిన రత్నం మాణిక్యంలను అరెస్టు చేసారు. మంచిర్యాలకు చెందిన ముకునూరి కిరణ్ కుమార్ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి బంగారు బ్రాస్లెట్ గొలుసు, పుస్తెలతాడు, ఉంగరం దాదాపు పది తులాలు ఉంటాయి. రూ.పదివేల నగదు, 6 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, బొమ్మ తుపాకులు స్వాధీనం చేసుకున్నారు.

# తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం

మొదటి పేజీ తరువాయి

ఏ-1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ-రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడిరది. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్ ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ-రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం'అని హరీశ్ రావు అన్నారు. అయితే స్పీకర్ వారిని వారించినా వినలేదు. భూభారతిపై చర్చకు పల్లా రాజేశ్వర్ రెడ్డికి అవకాశం ఇచ్చినా మాట్లాడలేదు. అనంతరం నినాదాలు చేస్తూ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ఫార్ములా ఈ రేసుపై చర్చ జరపాలని బీఆ ర్ఎస్ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. కానీ ప్రభుత్వం దానికి అనుమతించకపోవడంతో వారు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రపంచస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచే లక్ష్యంతో హైదరాబాద్ నగరానికి ఫార్ములా ఈ కారు రేసింగ్ ను కేటీఆర్ తీసుకొస్తే.. ఆయనపై అక్రమ కేసులు పెట్టడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ అంశంపై చర్చకు పెడితేనే నిజానిజాలు ప్రజలకు తెలుస్తాయని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా ఈ కారు రేసింగ్ పై చర్చకు అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు.

## వైభవంగా గంగా, గౌరీ, శంకరుల కళ్యాణం



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 20 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి గ్రామంలో గోదావరి నదిపై ఉన్న గంగా, గౌరీ, శంకరుల ఆలయంలో 22వ వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం అర్చకులు ఓంకార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఆలయ మండపంలో లోక కళ్యాణం కోసం శాంతి యజ్ఞం నిర్వహించారు. అనంతరం గంగా, గౌరీ, శంకరుల ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కళ్యాణ మండపంలో వేదమంత్రోచ్చరణల మధ్య కళ్యాణం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి, స్వామివారికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జువ్వాడీ కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్‌లు కున గోవర్ధన్, బోరిగాం రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి ప్రత్యేక పుజలు నిర్వహించారు. అనంతరం పలువురిని అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో విక్రమ్ గౌడ్, అర్చకులు ఓంకార్ శర్మ, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాన గంగారెడ్డి, అభివృద్ధి సభ్యులు బెల్లల నరేశ్, గాదె రాజన్న, జిందం గంగాధర్, నిరటి రతన్, అవుట్ల సత్యం, ఉత్సవ కమిటీ సభ్యులు అక్కినపెల్లి శంకర్, కల్లెడ గంగాధర్, దాసరి రాజన్న, భక్తులు దాసరి గంగనర్సయ్య, అవుట్ల లక్ష్మణ్, కున రాకేశ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ మధుసూదన్

మల్యాల, డిసెంబర్ 20 (మన బలగం): కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ మధుసూదన్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలపై శుక్రవారం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలోని 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండి, బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ బీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన వారందరికీ బీమా నమో చేసారు. రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీ కృష్ణ మోహన్, వీవోఏ సుధ, బీసీ పాయింట్ నిర్వాహకులు గంగాధర్, వివిధ మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీజేపీ వైఖరిని ఖండిస్తూ తహసీల్దార్‌కు వినతి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 20 (మన బలగం): బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై బీజేపీ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఇండియా కూటమి సభ్యులు చేపట్టిన నిరసనను అడ్డుకొని ప్రతిపక్ష నేత, జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీపై దాడికి పాల్పడి, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దూదిగం గంగాధర్, ఏఎంసీ చైర్మన్ బొరిగం రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట రెడ్డి, కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముక్కెర వేణుగోపాల్, మాజీ సర్పంచులు లక్కం నర్సక్క, గంగాధర్, మాజీ ఉప సర్పంచులు రాజేశ్, రాజ్ కుమార్, నల్ల రామరాజు, ఇట్టేడి శ్రీనివాస్, రామానుజం, గుమ్మల రమేశ్, జలేశ్, రమేశ్, బండిరాజేశ్, రాజు, సాగర్, మహిపాల్, అశోక్, వాల్గొట్ నరేశ్, హరీశ్ యాదవ్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి






నిర్మల్, డిసెంబర్ 20 (మన బలగం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్ షా చిత్రపటాన్ని చింపి నిరసన వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు మాట్లాడుతూ దళితుల వెనుకబాటుతనాన్ని, అంటరానితనాన్ని తీవ్రంగా ప్రశ్నించి, తన జీవితాన్ని బడుగు, బలహీన వర్గాలకు అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అమిత్ షా అంబేద్కర్‌ను పలుచన చేస్తూ వ్యాఖ్యలు చేయడం, వాటిని ప్రధానమంత్రి మోడీ సమర్థించడం సరికాదని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షులు చిన్నూ మాట్లాడుతూ రాజ్యాంగ మార్పు అనేది బీజేపీ లక్ష్యం అని, అమిత్ షా అంబేద్కర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. వెంటనే అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్ రెడ్డి, అబ్దుల్ హాదీ, పట్టణ అధ్యక్షులు నందేడపు చిన్ను, నిర్మల్, లక్ష్మణచంద మండల పార్టీ అధ్యక్షులు కుంట వేణుగోపాల్, వోడ్నాల రాజేశ్వర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సమర సింహారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు రాకేష్, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు అర్షద్, దేవరకోట దేవస్థాన చైర్మన్ శ్రీనివాస్, నాయకులు మతీన్, జునైద్, పురపాలక సంఘం మాజీ ఉపాధ్యక్షులు వాజీద్ ఖాన్, నర్సారెడ్డి, అయ్యన్నగారి పోశెట్టి, కొంతం గణేష్, సభా కలీం, మజర్, భూరాజ్, రఫీ, గుల్లె రాజన్న, అడ్పా శ్రీకాంత్, నవీద్, తదితరులు పాల్గొన్నారు.

### అమిత్ షాను బర్తరఫ్ చేయాలి: సీపీఐ

కరీంగనర్, డిసెంబర్ 20 (మన బలగం): భారత పార్లమెంటులో అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు ఖండించారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతోన్మాద, మనువాద హోం మంత్రి అమిత్ షా వెంటనే ప్రజల క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన హోం శాఖ మంత్రి ఈ విధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అంబేద్కర్‌ను అభిమానించే కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీల మనోభావాలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని, అవి ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతంలో భాగమేనని ఆరోపించారు. గతంలో బీజేపీ నాయకులు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని పలు మార్లు పేర్కొన్నారని, ఇప్పుడు అదే రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు దానికి నిదర్శనం అన్నారు. అనగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్‌పై దాడి అంటే రాజ్యాంగంపైన దాడి అని ప్రతి ఒక్క పౌరుడు భావించాలన్నారు. వెంటనే బీజేపీ ప్రభుత్వం అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాతపై వ్యంగంగా మాట్లాడిన బీజేపీ నాయకుడు అమిత్ షా మనువాద ధోరణిని పార్లమెంటులో చూపించారని, వెంటనే ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అమిత్ షా వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు డిమాండ్ చేశారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, డిసెంబర్ 20 (మన బలగం): అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికా హారం అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో ప్రతి రోజూ చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులను మెరుగుపర్చాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పిల్లలకు సురక్షితమైన, శుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, విద్య పరంగా అవగాహన పెంచాలన్నారు. కేంద్రాల పనితీరు మెరుగుపడి, పిల్లల, గర్భిణుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాలలో న్యూట్రి గార్డెన్స్‌ను ఏర్పాటు చేసి పెంచిన ఆకు కూరలు, కూరగాయలను ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించాలన్నారు. ప్రతి రోజూ కోడిగుడ్డు, ఇతర పోషకాహార పదార్థాలను అందించి రక్తహీనత పిల్లల ఎదుగుదల లోపం వంటి సమస్యలను నియంత్రించాలని సూచించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతాన్ని అందించాలని, ఏకరూప దుస్తులను అందజేయాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పర్యవేక్షకులు అంగన్వాడీల నిర్వహణ తీరును పరిశీలించి నివేదికలను పంపాలన్నారు. చిన్నారుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలని, మండలాల వారీగా అంగన్వాడీల్లో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్స్, సామ్, మామ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేసి నివేదికలను అందజేయాలన్నారు. అంగన్వాడీల పరిసరాలలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. సమావేశంలో సీడీపీవోలు నాగలక్ష్మి , నాగమణి, సరిత, సరోజిని, మండలాల అంగన్వాడీ పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

### పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల




నిర్మల్, డిసెంబర్ 20 (మన బలగం): పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు.శుక్రవారం నిర్మల్ పట్టణంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ అవినాష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఉపేందర్ రెడ్డి, డీఎస్పీ గంగా రెడ్డి పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముందుగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే మతపరమైన, సాంస్కృతిక పండుగ అని అన్నారు. ప్రతి ఏటా క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ రోజు ఈ సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అన్ని మతాల ప్రజలు మతసామరస్యాన్ని పాటిస్తూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం సెమీ క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరెళ్ల గుట్టలో గుర్తుతెలియని శవం?

ధర్మపురి, డిసెంబర్ 20 (మన బలగం): ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరెళ్ల గుట్టలో గుర్తు తెలియని మృతదేహం ఉందనే వదంతులు రెండు రోజులుగా గుప్పు మంటున్నాయి. వదంతుల కారణంగా గ్రామ ప్రజలు ఏం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. నేరెళ్ల గ్రామంలో ఏ నలుగురు కలిసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. పోలీసుల సమాచారం మేరకు నేరెళ్ల గ్రామం నుంచి మిస్సింగ్ ఫిర్యాదులు నమోదు కాలేదు. ఈ వదంతులు నిర్ధారించుకోవడానికి ఇద్దరు వ్యక్తులను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

MANA BALAGAM
మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

# పుష్ప-2కు ఆ రెండు సినిమాలే టార్గెట్



భారీ అంచనాల మధ్య విడుదలై ఎప్పటిలాగే సౌత్‌తోపాటు నార్తిండియన్ ప్రేక్షకులను ఫిదా చేస్తున్నాడు పుష్పరాజ్. ఐకాన్ అల్లు అర్జున్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప -2 ది రూల్  డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన పుష్ప 2 ది రూల్ ఓపెనింగ్ డేనే జవాన్, ఆర్ఆర్ఆర్ రికార్డును బద్దలు కొట్టిందని తెలిసిందే. తాజా కలెక్షన్ల రిపోర్ట్‌తో పుష్పరాజ్ మేనియా ఎలా ఉందో అర్థమవుతోంది. పుష్పరాజ్ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. 15 రోజుల్లోనే రూ.1508 కోట్లు వసూళ్లు రాబట్టి అత్యధిక వేగంగా ఈ మార్క్ చేరుకున్న చిత్రంగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఇప్పటివరకు ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ ఇండియన్ మూవీస్ అమీర్ ఖాన్ దంగల్ (రూ.2070. 30 కోట్లు), బాహుబలి.. ది కంక్లూజన్ (రూ.1786.06 కోట్లు) పేర్లతో ఉన్న రికార్డ్‌ను పుష్ప 2 ది రూల్ అధిగమించడం ఖాయమని తాజా కలెక్షన్లు చెప్పకనే చెబుతున్నాయి. పుష్ప 2 మరికొన్ని రోజుల్లోనే ఈ ఫీట్ చేరుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం కన్నడ సోయగం రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా ఇంప్రెస్ చేసింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు.

# ప్రైవేసీ ఇవ్వండి


రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ గురించి ఎప్పుడూ ఏదో ఒక వార్త ట్రెండ్ అవుతూనే ఉంటుంది. ప్రస్తుతం విజయ్ డేటింగ్ లైఫ్ గురించి అనేక వార్తలు ప్రచారమవుతున్న నేపథ్యంలో ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చాడు. తన పర్సనల్ విషయాల గురించి వెల్లడించేందుకు సరైన టైమ్ చూసుకొనే వాస్తవాలు మాట్లాడుతా అన్నారు. ఇంకా ఏం చెప్పారంటే.. రీసెంట్‌గా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ… "నేను ప్రజల ముందున్న వ్యక్తినే. నాకు సంబంధించిన విషయాలు అందరికీ తెలుసుకోవాలనే ఆసక్తి సహజమే. కానీ, నా జీవితంలో ఓ ప్రత్యేక సమయం వచ్చినప్పుడు మాత్రమే వాటిని పంచుకుంటాను. పబ్లిక్ ఫిగర్‌గా ఉండటం వల్ల చాలా వార్తలు వస్తాయి. వాటిని నేను సాధారణంగానే స్వీకరిస్తాను. అవి నా దృష్టిలో కేవలం వార్తలుగానే ఉంటాయి. అపారమైన ప్రేమ ఉంటే, దాని వెంట బాధ కూడా తప్పదు. ప్రేమించడం అంటే బాధను కూడా పంచుకోవడం. తగిన సందర్భంలో, సరైన కారణంతోనే విషయాలను పంచుకుంటా" అని ఆయన క్లారిటీ ఇచ్చేశాడు.  ప్రస్తుతం విజయ్.. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి, రవి కిరణ్ కోలా, రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ మూడు సినిమాలు చేయనున్నాడు. ఇక 14 కథ విషయానికొస్తే.. రాయలసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కనుంది. ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇప్పటీకే రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ ఆసక్తి కలిగిస్తోంది. బీటలు వారిన పంట పొలాల్లో రాతిపై చెక్కిన వీరుడి విగ్రహం ఉంది. దాని మీద 'ది లెజెండ్ ఆఫ్ ది కర్స్డ్ ల్యాండ్' అని రాసి ఉంది. ఆయన జీవిత కాలం 1854 నుంచి 1878గా పేర్కొన్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1978 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు.



# 'ముఫాసా' ది లయన్ కింగ్ సరికొత్త రికార్డు



సోషల్ మీడియా ట్రెండ్స్‌లో మహేష్ బాబు ఫ్యాన్స్ అందరి హీరోల అభిమానుల కంటే ముందుంటారు. అలాగే టికెట్స్ బుకింగ్స్, కలెక్షన్స్ విషయంలోను కొత్త హిస్టరీలను ఎప్పటికప్పుడు కొత్తగా సృష్టిస్తూనే ఉంటారు. ప్రస్తుతం మహేష్ సినిమా ఏది రిలీజ్ లేకపోయినప్పటికీ బాబు ఫ్యాన్స్ సరికొత్త రికార్డ్ సృష్టించారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. ప్రముఖ హాలీవుడ్ నిర్మాణసంస్థ డిస్నీ తెరకెక్కించిన 'ముఫాసా' ది లయన్ కింగ్' నేడు ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయ్యింది. ఇంగ్లీష్ వెర్షన్ కి ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులువాయిస్ అందించగా హిందీలో షారుఖ్ ఖాన్ తన గాత్రాన్ని అందించారు. ఇక తెలుగులో మహేష్ బాబు, సత్యదేవ్, బ్రహ్మానందం, అలీ తదితరులు వాయిస్ అందించిన విషయం తెలిసిందే. అయితే హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ లో ఈ మూవీ ఉదయం 8 గంటల షో హౌస్ ఫుల్ అయ్యింది. అయితే ఈ సినిమాకి ఇండియాలోని అన్ని థియేటర్ల కన్న ముందే ఫుల్ కావడం విశేషం. ఇది కంప్లీట్‌గా మహేష్ బాబు ఫ్యాన్స్ డామినేషన్. కేవలం వాయిస్‌కే కటౌట్లు పెట్టి, హౌస్ ఫుల్స్‌తో రికార్డులు నెలకొల్పతున్న మ్యాడ్‌నెస్ ఆయన అభిమానులకు మాత్రమే సొంతం. మరోవైపు మహేష్, రాజమౌళి సినిమా జనవరి ద్వితీయార్థంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి షూటింగ్ మొదలుపెడతారు. ఇప్పటికే ఏర్పాటు జరుగుతున్నాయి. అయితే రాజమౌళి స్క్రిప్ట్ విషయంలో ఇంకాస్త సమయం తీసుకోబోతున్నారని, ఏప్రిల్ వరకూ షూటింగ్ మొదలు కాదని అనుకున్నారు. అయితే జనవరిలోనే ఈ సినిమా ప్రారంభానికి శ్రీకారం చుట్టడం అభిమానులకు కాస్త ఆశ్చర్యంగా ఉంది.



# సూపర్ స్టైలిష్‌గా సోహైల్‌ఖాన్

బింబిసార తర్వాత నందమూరి కల్యాణరామ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్21. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ఇప్పటికే 21 అనౌన్స్ మెంట్ పోస్టర్ లాంచ్ చేశారని తెలిసిందే. ఇందులో పిడికిలి బిగించి ఉన్న కల్యాణ్ రామ్ చేతిపై రక్తపు మరకలు చూడొచ్చు. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ సోహైల్‌ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా మేకర్స్ సోహైల్‌ఖాన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. లుక్ ఒకటి విడుదల చేశారు. ఈ చిత్రంతో సోహైల్ ఖాన్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నాడు. సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తుండగా.. ఇంతకీ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడనేది సస్పెన్స్ నెలకొంది.  ఈ మూవీలో సయీ మంజ్రేకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తుండగా.. శ్రీకాంత్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో అశోక్ వర్ధన్ ముప్ప, సునిల్ బలుసు, ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.అశోక క్రియేషన్స్ బ్యానర్‌లో వస్తోన్న రెండో సినిమా ఇది. ఈ చిత్రంలో క్లైమాక్స్ ఎపిసోడ్ కోసం మేకర్స్ ఏకంగా రూ.8 కోట్లు ఖర్చు పెట్టారని ఇన్‌సైడ్ టాక్.